
# ఇలాగ ఎందరో

బ్రీఫ్ మాన్



కథ వ్రాయాలనే కోరిక నాలో ఎప్పుడు, ఎలా మొదలయిందోగాని, రోజు రోజుకీ పెరిగి అది 'వటుడింతై – ఇంతింతై' అన్నట్టుగా తయారయింది.

మంచి రోజు చూసి మరీ కూర్చున్నాను కథ వ్రాద్దామని. ఎంత ప్రయత్నించినా, కలం ముందుకు సాగనంటోంది. అతిగా ఆలోచించానేమో నెప్పిగా తలనెప్పి ప్రారంభమయింది దానితో కథ వ్రాసే ప్రయత్నాన్ని మరోసారికి వాయిదా వెయ్యక తప్పలేదు. తలంతా దిబ్బగా వుంది. చల్లగాలికి కాస్సేపు అలా పార్కులో కూర్చుందామనిపించి స్కూటర్ బయటకు తీసాను.

వచ్చే పోయే జనంతో కళకళ్లాడుతూ ఎంతో సందడిగా వుంది పార్కు. ప్రభుత్వం సాధించిన ప్రగతిమీద మంత్రిగారి ఉపన్యాసంలా చాలా అందంగా, ఆహ్లాదకరంగా వుంది సాయంకాలం నీరెండ. జన సంచారం తక్కువగా వున్న చోట కూర్చుని ప్రకృతి సౌందర్యాన్ని చూస్తూ పరిసరాల్ని మరచిపోయాను.

“బాబూ!”

నా ఏకాంతానికి అంతరాయం కలిగించిన ఆ పిలుపు చిరాకు కలిగించింది. “చిల్లరలేదు ఫో” అన్నాను.

“ధర్మం కోసం రాలేదు బాబూ!”

“మరి ధర్మం చెయ్యడానికి వచ్చేవా?” అంటూ ఆ మనిషి వైపు చూసా. “పి... చ్చి... వా... డు...” అసంకల్పితంగా వచ్చేసింది ఆ మాట.

పిచ్చివాడు నవ్వేడు—

ఒళ్లు జలదరించింది ఆ నవ్వుకి. ఇదే పార్కులో చాలాసార్లు చూసేను వాడిని. కాని యిలా దగ్గరగా ఎప్పుడూ చూడలేదు. తైల సంస్కారం లేక, రాగి వర్ణంగా మారిన చింపిరితల; గుబురుగా పెరిగిన గడ్డం, చిరిగి శిథిలావస్థలో వున్న పంచె, చొక్కా; చేతిలో పాతగుడ్డల మూట— ఇదీ వాడి అవతారం. ఓ సారి చుట్టూ చూసాను దగ్గర్లో ఎవరూ లేరు. ఎందుకో భయం అనిపించింది.

నా ఆలోచన వాడికి తెలిసినట్టుంది. “భయం లేదు బాబూ!... నేను ఏమీ చెయ్యను” అన్నాడు నాకు కాస్త దూరంగా కూర్చుంటూ.

వాలకం పిచ్చివాడిలా వున్నా, మాట తీరు బాగానే వుంది. ఏమయినా— తొందరగా వదిలించుకోవడం మంచిదనిపించింది. “ఏం కావాలి నీకు?” ఈసారి నా మాటలు సౌమ్యంగా వున్నాయి

నా ప్రశ్నకు జవాబివ్వలేదు “మీ కాలం వృథా చేస్తున్నట్టున్నాను” అన్నాడు. పిచ్చివాడిలో సంస్కారం నన్ను చకితుణ్ణి చేసింది. అసలు పిచ్చిలేదేమో అన్న అనుమానం కూడా కలగకపోలేదు. కాని ఆకార విశేషాలు అవునని నిరూపిస్తున్నాయి.

“వస్తాను బాబూ!” అని లేస్తున్న పిచ్చివాణ్ని కూర్చోమని “మీ గురించే ఆలోచిస్తున్నాను” అన్నాను. అనుకోకుండానే నా సంబోధనలో వచ్చిన మార్పుని గమనించక పోలేదు నేను.

“నా గురించి అంతగా ఆలోచించాల్సినదేమీ లేదు బాబూ”

“అభ్యంతరం లేకపోతే మీ గురించి తెలుసుకోవాలనివుంది.”

కాదనలేక పోయాడు పిచ్చివాడు. “అలాగే బాబూ... కానీ నా గురించి చెప్పే ముందు మీకు ఓ కథ చెపుతాను” అంటూ నా వైపు

చూసాడు. చెప్పమన్నట్టుగా తలనూపేను.

కొద్ది క్షణాలు మౌనంగా వుండిపోయాడు. గత స్మృతుల భావ సంఘర్షణ అతని మొహంలో ప్రస్ఫుటంగా కనిపిస్తోంది. పిచ్చివాడి పెదవులు కదిలేయి...

* * *

ఆపరేషన్ గది ముందు అసహనంగా పచార్లు చేస్తున్నాడు కాంతారావు. మధ్య మధ్యలో మూసివున్న తలుపుల వైపు, ఆ పైన వెలుగుతున్న ఎర్రటి లైటు వైపు భయం భయంగా చూస్తున్నాడు.

తలుపులు తెరుచుకున్నాయి. "మగపిల్లవాడు" అన్నాడు డాక్టర్— గదిలోంచి బయటకు వస్తూ.

కాంతారావు మనసంతా సంతోషంతో నిండిపోయింది. ఆ కళ్లల్లో వెలుగు, ఓ విధమైన గర్వం తొంగి చూసింది.

అవును మరి... తను కూడా ఓ బిడ్డ తండ్రి అయ్యాడు అదీ—పెళ్ళయిన పదిహేను యేళ్ళకి, యింక పిల్లలు పుట్టరేమోనని నిరాశ పడుతున్న సమయంలో.

"కాని తల్లి ప్రాణం కాపాడలేకపోయాం... వెరీ సారీ" అని ధైర్యం కోసం అన్నట్టుగా కాంతారావు భుజం మీద చెయ్యివేశాడు డాక్టరు.

సంతోషాన్ని, దుఃఖాన్ని ఒకేసారి అనుభవిస్తున్న చిత్రమైన స్థితిలో నిర్లిప్తంగా వుండిపోయాడు కాంతారావు. ఆపరేషన్ గదిలోంచి స్ట్రెచర్ మీద తీసుకువస్తున్న భార్య శవం— నీటిపొరలలో నిండిన అతని కళ్ళకి మసక మసగ్గా కనిపించింది.

## ఇలాగ ఎందరో

పిల్లలు, పున్నామ నరకం నుంచి తప్పించే మాట ఎలా వున్నా— పిల్లలు పుట్టక పోతే మాత్రం, ఆ నరకం ఏదో యిక్కడే అనుభవించేస్తారు పెద్దలు.

పిల్లల కోసం కాంతారావు దంపతులు చెయ్యని పూజ, మొక్కని దేవత, తిననిమందు లేదు. వేటి ఫలితమో గాని— నలభయ్యో పడి దాటే సమయంలో అటు పుత్రోదయం, ఇటు కళత్ర వియోగం రెండూ జరిగాయి.

భార్య మరణంతో మానసికంగా దెబ్బతిన్న కాంతారావు కోలుకోవడానికి ఏడాది పట్టింది. ఉద్యోగ ధర్మంగా స్కూలుకి వెళ్ళి వస్తున్నాడేగాని, తోటి ఉపాధ్యాయులతోటి వెనకటి మాదిరిగా కలిసి తిరగలేక పోయేడు. కొడుకు పరిస్థితికి విచారిస్తూ, మనవణ్ణి సాకుతూ కాలం నెట్టుకొస్తోంది కాంతారావు తల్లి.

విధి మరోసారి చిన్నచూపు చూసింది. ఒక దెబ్బనుంచి కోలుకుంటున్న సమయంలో మరో దెబ్బ తగిలింది. కాంతారావుకి వున్న ఒక్క ఆడదిక్కూ తల్లి కూడా కాలంతీరి తన దారి తను చూసుకుంది.

ఇంక మిగిలింది— తనకి ఏడాది కొడుకూ, వాడికి తనూ. తన ప్రేమలో పాలు పంచుకునేవాళ్ళు ఇంక ఎవ్వరూ లేకపోవడంతో కొడుకుమీద మమతానురాగాలు పెరిగాయి. కొడుకు సంరక్షణా భారమంతా తనే చూసుకుంటూ ఓ రకంగా తృప్తి పడుతున్నాడు కాంతారావు.

అతని అవస్థ చూసి, రెండో పెళ్లి చేసుకోమని చెపుతూ వచ్చేరు స్నేహితులంతా. నవ్వేసి వూరుకునేవాడు.

"నువ్విలా దాటేస్తే కాదు... ఈ రోజు ఏదో ఒకటి చెప్పాలి" చనువుగా అడిగేడు రమణమూర్తి. తోటి టీచర్లలో అతనితోటే ఎక్కువ స్నేహంగా వుంటాడు కాంతారావు.

"ఏం చెప్పమంటావ్?"

"అదే— నీ పెళ్లి సంగతి"

"ఈ వయసులో రెండో పెళ్ళా?"

"నీకు ఏమంత వయసు ముదిరి పోయిందని... నలభయ్యేగా"

"వద్దు మూర్తీ! నాకు మళ్లీ పెళ్లి చేసుకోవాలని లేదు."

"భార్య అవసరం నీకు లేకపోవచ్చు... కాని పిల్లాడికి తల్లి కావాలిగా." నచ్చచెప్పే ప్రయత్నం చేసేడు రమణమూర్తి.

"తల్లేగాని కన్నతల్లి తిరిగి రాదు. దయచేసి, యికముందు ఈ ప్రస్తావన తేవద్దు." అనేసి లేచిపోయాడు కాంతారావు— చెమ్మగిల్లిన కళ్ళు వత్తుకుంటూ.


ఆ రాత్రి పడుకున్నాడేగాని కాంతారావుకి నిద్రపట్టలేదు. మూర్తి మాటలు గుర్తుకు వస్తున్నాయి.

"—అవును... ఇప్పుడు తన వయసు నలభయ్యేళ్ళు. సరిగ్గా యిరవయి మూడోయేట పెళ్ళయింది. ఇంచుమించు పదిహేను సంవత్సరాల వైవాహిక జీవితం గడిపేడు తను. మంచి చెడ్డలు రెండూ చవి చూసేడు... యింక యిప్పుడే కోరికా లేదు తనకి. నిస్సారమైన తన జీవితంలోకి యింకో వ్యక్తిని తీసుకువచ్చి ఆమెను అన్యాయం చెయ్యకూడదు. తన ధ్యేయం ఒక్కటే... బాబుని పెంచి పెద్ద చెయ్యాలి—". ఆ అభిప్రాయాన్ని మరి మార్చుకోలేదు.

కాలచక్రభ్రమణంలో మరో మూడు సంవత్సరాలు గడిచిపోయాయి. నాలుగేళ్ల తన కొడుకుని దగ్గర్లో వున్న కాన్వెంటులో చేర్పించాడు కాంతారావు. రోజులు సాఫీగానే గడుస్తున్నాయి.

ఓరోజు రాత్రి—


కాంతారావుకి కంటిమీద కునుకులేదు. కడుపులో నెప్పి అంటూ బాధపడుతున్నాడు కొడుకు. నెప్పి ఎక్కడో సరిగ్గా చెప్పలేక పోతున్నాడు. అక్కడికీ తనకు తెలుసున్న 'కడుపునెప్పి మటుమాయం' సినిమా ప్రకటన



మందులు ఏవో కొన్ని ఇంటో వున్నవి వాడి మాసేడు. కాని కొడుకు బాధ తగ్గలేదు.

మర్నాడు స్కూలుకి శెలవుపెట్టి గవర్నమెంటు పెద్దాసుపత్రికి తీసుకు వెళ్ళేడు కాంతారావు.

అప్పటికి — చిల్డ్రన్స్ వార్డులో పెద్ద డాక్టరుగారు యింకా రాలేదు. తీరా ఆయన వచ్చి కూర్చునే సమయానికి ఎవరో మంత్రిగారు ట్రీట్‌మెంట్ కోసం వచ్చారంటూ కబురందింది డాక్టరుగారికి. వెంటనే మాడ్డానికి వెళ్ళేరు.




"ఏ మంత్రిగారు?...? అసలు ఆయనకి ఏవయింది ?" వైద్యానికి వచ్చిన రోగుల ఆదుర్దా. మరి ఆయన మంత్రిగారు.

ఇదంతా చూసి డాక్టరుగారి దగ్గరుండే ప్యూన్‌కి హుషారొచ్చింది. "మంత్రిగారు కారు దిగబోతూండగా, కాలికి ఖద్దరు పంచె అడ్డంపడి, తూలి పడలేదుగాని కాలు బెణికిందిట." అదీ సంగతి అంటూ అసలు విషయం చెప్పేడు.

"మరి అక్కడ పిల్లల డాక్టరుగారు ఏం చేస్తారు?" జనంలోంచి ఎవరో అన్నారు.

"ఆయన ఏదో చేద్దామని కాదు... మంత్రిగారి ఆరోగ్యం గురించి ఆందోళన వ్యక్తపరచడానికి వెళ్ళేరు." మరో గడుసువాడి సమాధానం.

ఆ మాటకి అంతా నవ్వేరు. "వుష్... నవ్వకండి. డాక్టరుగారు వస్తున్నారు." ప్యూన్ కోప్పడ్డాడు.

## ఇలాగ ఎందరో

అప్పుడు మొదలైంది వైద్యం మామూలు జనానికి. మధ్యలో కాంతారావు కూడా కొడుకుని చూపించేడు. రోగ లక్షణాలు నిదానంగా వినే తీరికలేదు డాక్టరుగారికి. ఆయన మెడలో వున్న స్టెతస్కోపు— సినిమాల్లో శివుడు మెడలో రబ్బరు పాములా కదలిక లేకుండా అలాగే వుంది.

చెప్పడం పూర్తయేలోపునే "యూరిన్, మోషన్, బ్లడ్ టెస్ట్ చేయించండి" అంటూ ఓ కాగితం మీద అర్థంకాని అక్షరాలు యేవో వ్రాసియిచ్చేరు.

అవన్నీ చేయించి, రిజల్ట్ కాగితం తెచ్చేటప్పటికి, డాక్టరుగారి డ్యూటీ అయిపోయి వెళ్ళిపోయారు. "ఇంక మళ్ళీ రేపే చూస్తారు." టేబుల్ సర్దుతున్న ప్యూన్ ద్వారా తెలిసింది ఆ విషయం.

మధ్యాహ్నం అయింది. కొడుకు నెప్పితో అలాగే బాధపడుతున్నాడు. కాంతారావుకి కాలూ చెయ్యీ ఆడటం లేదు. ఏమీ పాలుపోక, తన మిత్రుడు రమణమూర్తిని సంప్రదించేడు.

"గవర్నమెంటు హాస్పటల్ లాభంలేదు. సాయంకాలం ఆ పెద్దడాక్టరు గారి నర్సింగ్ హోమ్‌కి తీసుకెళ్ళు." సలహా యిచ్చేడు రమణమూర్తి.

ఆలస్యం చెయ్యలేదు కాంతారావు. కన్సల్టేషన్ ఫీజు పాతిక రూపాయలు కట్టి డాక్టరుగార్ని కలిసేడు.

డాక్టరుగారి చేతులు చకచకా పిల్లవాడిని పరీక్షించేయి. వెంటనే ఎక్సరే ఫొటో తీసారు. ఆ బిల్లు వేరే చెల్లించేడు కాంతారావు. ఫొటో మాసి ఆపరేషన్ చెయ్యాలని చెప్పేరు. ఆ ప్రయత్నం కూడా నిమిషాల మీద జరిగింది. కాని కాంతారావుకొడుకు దురదృష్టవంతుడు. ఆపరేషన్ చెయ్యక ముందే చచ్చిపోయేడు.

"టూలేట్ ... ఇప్పటిదాకా డాక్టరుకి చూపించకుండా ఏం చేస్తున్నారు. ఇది ఇరవయి నాలుగు గంటలలోగా ఆపరేషన్ చెయ్యాల్సిన కేసు" అంటూ కోప్పడి, ఆ తర్వాత జాలిపడ్డాడు డాక్టరుగారు.

ప్రొద్దున్న మీరు మాసేరని చెప్పాలనిపించలేదు కాంతారావుకి. కొడుకు శవాన్ని భుజం మీదవేసుకుని మౌనంగా బయటకొచ్చేడు.

ఇప్పుడు కాంతారావుకి భవబంధాలు ఏమీ లేవు. చేస్తున్న వుద్యోగం మానేశాడు. తన కొడుకు చావుకి పరోక్షంగా కారణమైన ఆ డాక్టరు కొడుకు చావుకి కారణమయి కసి తీర్చుకోవాలనుకున్నాడు. కాని కొడుకును పోగొట్టుకున్న బాధ తెలుసున్న తండ్రిగా ఆ పని చెయ్యలేక పోయేడు.

ఎంతో అపురూపంగా, ఆశలన్నీ వాడిమీదే పెట్టుకుని బ్రతుకుతున్న కాంతారావు — కొడుకు మరణాన్ని తట్టుకోలేక పోయేడు. కళ్ళల్లో నీళ్ళు యింకి పోయేలా ఏడ్చాడు. చివరికి మతి చెడి పిచ్చివాడయ్యాడు.

* *

పిచ్చివాడు ఏడుస్తున్నాడు. నిస్తేజమైన అతని కళ్ళల్లో నీళ్ళు. "ఇప్పుడు చెప్పమంటావా బాబూ నా కథ" ఏడుస్తూనే అన్నాడు.

"వద్దు కాంతారావుగారూ! కాని ఒక్క మాట... ఆ డాక్టరుగారి పేరు తెలుసుకోవచ్చా?" అడిగేను— నాకు కూడా కళ్ళల్లో నీళ్ళు నిండుతూండగా.

అతను చెప్పిన పేరు విని ఆశ్చర్యపోయాను. నేను తేరుకునేలోగా కాంతారావు వెళ్ళిపోయాడు.

బరువెక్కిన గుండెలతో లేచి స్కూటర్ స్టార్ట్ చేసాను. పిచ్చివాడు— కాదు— కాంతారావు చెప్పిన డాక్టరు పేరు నా చెవిలో ప్రతిధ్వనిస్తోంది.

అంతర్జాతీయ బాలల సంవత్సరంలోచేసిన విశిష్ట సేవలకుగాను ప్రభుత్వ ప్రశంసాపత్రం పొందిన మా నాన్నగారిపేరు అది.